క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని మంగళిగూడ గ్రామంలో పొరండ్ల పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మంగళవారం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, శంకర్‌రెడ్డి రూ.3వేలు, ఎంపీటీసీ సురేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు రూ.2వేల చొప్పున నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొత్తూరు: నేడు(బుధవారం) ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆమె కోరారు.

కాంగ్రెస్ పార్టీ విధానాలు మారాలి

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ విధానాలు హిందూవులకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఇప్పటికైనా ఆ పార్టీ తమ విధానాలను మార్చుకోవాలని బీజేవైఎం జిల్లా నాయకుడు కంచుకోట మహేశ్ అన్నారు. లోక్‌సభ సమావేశాల్లో ఎంపీ రాహుల్‌గాంధీ హిందూవులకు వ్యతిరేకంగా ప్రసంగించడాన్ని ఆరోపిస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందుత్వంపై మాట్లాడేవారు హింసను, అసత్యాన్ని ప్రచారం చేస్తున్నట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. భారతదేశంలో హిందూ వ్యతిరేకులపై ఎప్పుడు దాడులు జరగలేదన్నారు. హిందూ ధర్మం ప్రపంచం అంతా ఒక్కటేనని చెబుతుందని ఆయన గుర్తుచేశారు.

ప్రత్యేక సమావేశానికి హాజరుకండి

ఎంపీడీఓ సుమతి

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఎంపీడీఓ సుమతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నందిగామలో ఎంపీడీఓ సుమతి మాట్లాడుతూ.. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగిసిపోతున్న సందర్భంగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, వారందరినీ సన్మానించి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

6న తైబజార్ వేలం

కొత్తూరు: ఈ నెల 6వ తేదీన కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయంలో తైబజార్ వేలంను నిర్వహించనున్నట్లు కమిషనర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.10వేల డీడీతో పాటు రూ.2వేల దరఖాస్తు ఫారంతో కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. వేలంలో పాల్గొనేవారు 4 నుంచి 5వ తేదీ సాయంత్రం వరకు డీడీలు అందించాలని పేర్కొన్నారు.

నేడు షాబాద్ మండల సమావేశం

షాబాద్: మండల సర్వసభ్య సమావేశం 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అపర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ కోట్ల ప్రశాంతి రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరం

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని తిమ్మారెడ్డిగూడ తాజా మాజీ సర్పంచ్ మద్దూరు శకుంతల, తాళ్లపల్లి ఎంపీటీసీ గుత్తి సునీత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో దాతలు బొంతపల్లి విద్యాసాగర్, వీరేశ్, వీరయ్యలు ముందుకొచ్చి విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దూరు పాండు, రామస్వామి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మంచాల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడ కొండ గ్రామంలో రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆమె ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల అవసరాలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు అధికంగా నిధులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, నాయకులు పాండు, లచ్చిరాం, శివ, బావోజీ, బాలాజీస్వామి, మోతిరాంహర్య తదితరులు పాల్గొన్నారు.

లింకురోడ్డుకు మోక్షమెప్పుడో?

ఆలూరు నుంచి చేవెళ్లకు ఏళ్ల తరబడిగా ఉన్న దారి

శంకుస్థాపన చేసి నెలలు గడిచినా.. మొదలు కాని పనులు

బీటీతో ఎంతో మేలు జరుగుతుందంటున్న స్థానికులు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు గ్రామం నుంచి చేవెళ్ల మండల కేంద్రానికి చేరుకునే లింకురోడ్డుకు ఏళ్ల తరబడిగా మోక్షం లభించటం లేదు. ఈ రోడ్డు పనుల కోసం శంకుస్థాపన చేసి 10 నెలలు కావొస్తున్నా పనులు మాత్రం ప్రారంభించలేదు. మండలంలోని ఆలూరు గ్రామస్తులకు ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు ఆలూరు నుంచి చేవెళ్లకు వెళ్లే లింకురోడ్డును అభివృద్ధి చేస్తామనే హామీ హామీగానే మిగిలిపోతోంది కానీ పనులు మాత్రం ముందుకు సాగటం లేదు. దీనిపై ఆలూరు ప్రజలు ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులను నిలదీశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈరోడ్డుకు రూ.4.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. గతేడాది సెప్టెంబర్‌లో ఈ రోడ్డుకు అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు కలిసి శంకుస్థాపన చేశారు. నాయకులు తప్పకుండా ఈ రోడ్డును పూర్తిచేసి ప్రజా సమస్యను తీరుస్తామని హామీనిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ రోడ్డు పనులు మాత్రం ఇంకా ప్రారంభం



అధ్వానంగా ఆలూరు నుంచి చేవెళ్లకు వెళ్లే లింకురోడ్డు



శిలాఫలకం

కాలేదు. ఈ ప్రభుత్వంలో అయినా ఈ రోడ్డు పనులు జరుగుతాయా లేదా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

తగ్గనున్న ప్రయాణ సమయం, దూరం

చేవెళ్ల మండల కేంద్రానికి ఆలూరు గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన రోడ్డు వెంట వెళ్తే 13 కి.మీ.ల దూరం ఉంటుంది. ఇది చేవెళ్ల నుంచి హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ఆలూరు గేట్ నుంచి వెళ్లే దారి. అదే ఆలూరు నుంచి లింక్‌రోడ్డు న్యాలట గేట్ వద్ద కలిసేలా ఉంది. ఈ రోడ్డు ఆలూరు గ్రామస్తులకు చేవెళ్లకు చేరుకునేందుకు 9 కి.మీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ రోడ్డు వెంట ఆలూరు, న్యాలట గ్రామాల రైతుల పొలాలు సైతం ఉన్నాయి. ఇది కొంతదూరం మట్టిరోడ్డుగా కొంత దూరం మెటల్ రోడ్డుగా ఉంది. ఈ రోడ్డుపై ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలు లేకుండా నేరుగా గ్రామానికి చేరుకునే అవకాశం ఉంటుంది. అందుకే ప్రజలు ఈ రోడ్డే మండల కేంద్రానికి మేలు అంటున్నారు. వర్షాకాలం మినహా మిగతా కాలాల్లో ప్రజలు ఎక్కువగా ఈ రోడ్డు వెంటనే చేవెళ్లకు వెళ్లివస్తుంటారు. ఈ రోడ్డును బీటీరోడ్డుగా వేస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ రోడ్డుతో ఆలూరు గ్రామస్తులకే కాదు ఆలూరు గ్రామం మీదుగా ఇతర గ్రామాలకు వెంకన్నగూడ, అంతారం, కొకుంట్ల, తంగడపల్లి తలారం గ్రామస్తులకు కూడా రాకపోకలకు ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును బీటీరోడ్డుగా వేయాలని కోరుతున్నారు.

వర్షం పడితే ఇబ్బంది



ఆలూరు నుంచి చేవెళ్ల మండల కేంద్రానికి వెళ్లేందుకు లింకురోడ్డు ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. ఈ రోడ్డునే ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే ఇది మట్టిరోడ్డు కావటంతో వర్షాలు పడిన సమయంలో ఇబ్బంది పడుతున్నాం. ఈ రోడ్డును బీటీరోడ్డుగా చేయాలని ఎన్నోఏళ్లుగా కోరుతున్నాం. కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు మంజూరైందని చెబుతున్నారు తప్పా రోడ్డు పనులు మాత్రం ప్రారంభించడం లేదు. త్వరగా ఈ రోడ్డును బీటీగా మారిస్తే ఆలూరు ప్రజలకు, రైతులకు విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. - నర్సింలు, ఆలూరు

దూరం తగ్గుతుంది



ఆలూరు నుంచి చేవెళ్లకు లింకురోడ్డును అభివృద్ధి చేయటంతో ఆలూరు గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ లింకు రోడ్డుతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు దూరం తగ్గుతుంది. అంతే కాకుండా ప్రధాన రోడ్డుపై పెరిగిన వాహనాల రద్దీతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడిపోతున్నాం. ఈ రోడ్డు పూర్తయితే ఎలాంటి ప్రమాదాలు కూడా తగ్గుతాయి. అధికారులు స్పందించి త్వరగా పూర్తి చేయాలి. - భీమయ్య, ఆలూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఆలూరు-చేవెళ్ల లింక్ రోడ్డుకు సంబంధించిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పనులకు నిధులు మంజూరయ్యాయని గత ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేసిన మాట వాస్తవమే. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా చూస్తాను. ఈ నిధులను కాంట్రాక్టర్‌కు కేటాయించారా లేదా అనే విషయాలను ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకొని పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాను. - హిమబిందు, ఎంపీడీఓ, ఆలూరు గ్రామ ప్రత్యేకాధికారి

కేంద్రమంత్రులను కలిసిన బీజేవైఎం అధికార ప్రతినిధి



మంత్రి బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శివాజీ

కేశంపేట: న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉన్న బీజేవైఎంను గ్రామాల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సూచించినట్టు శివాజీ తెలిపారు.

మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



దామోదర రాజనర్సింహకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మంత్రి దామోదర రాజనర్సింహను, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మంగళవారం ఆయన నగరంలోని వారి నివాసాల్లో కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్ చౌహాన్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమ బాట సమస్యలపై సర్వే కార్యక్రమంలో భాగంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని నాయకులు పరిశీలించారు. అనంతరం పవన్ చౌహాన్ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వస్తుందన్నారు. అదేవిధంగా పిచ్చిమొక్కలు మొలవడంతో తరగతి గదుల్లోకి క్రిమి కీటకాలు వచ్చే అవకాశం ఉందని, పాఠశాల ఆవరణను అధికారులు వెంటనే శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు యూనిఫాంను వెంటనే అందజేయాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. బిల్లులు రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ చారి, ఆకాశ్‌నాయక్, అరుణ్, రాహుల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గురుకుల డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణ శివారులోని నూర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీఏలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో ఈనెల 5లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న రాజు

నందిగామ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే పౌష్టికాహారం తీసుకున్నట్లయితే ఆరోగ్యంగా ఉంటారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారు రాజు అన్నారు. మండల పరిధిలోని మేకగూడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బండారు రాజు మంగళవారం పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండారు రాజు మాట్లాడుతూ.. విద్యార్థులకు తనవంతు సాయంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తామన్నారు. ఏడాది వరకు ఈ ఉచిత పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంగీత, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమా మహేశ్వర్, నాయకులు దేవేందర్, గ్రామ కార్యదర్శి నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయకులను చులకనగా చూడొద్దు

- ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి
- ఉద్విగ్నంగా చివరి మండల సర్వసభ్య సమావేశం
- విద్యా, పంచాయతీరాజ్ ఏఈలపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పక్కన వైస్ ఎంపీపీ ప్రవళిక, ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: అధికారులు నాయకులను చులకన భావంతో చూడొద్దని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా నిరంతరం ప్రజాసేవలో ఉన్నామని, ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం రావడం సంతోషకరమని పేర్కొన్నారు . ఐదేళ్ల కాలంలో ఏంఈఓ అక్బర్, పంచాయతీరాజ్ ఏఈ యుగేందర్‌లు అభివృద్ధికి సహకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మిగతా శాఖల అధికారులు అద్భుతంగా పని చేశారని కితాబు ఇచ్చారు. చివరి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపీటీసీలు తమ అనుభవాన్ని అందరితో పంచుకున్నారు. సమావేశానికి హాజరైన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులైన రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌లను ఎంపీడీఓ వెంకయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పోటీ పడుతూ పనిచేశారని, సభ్యులు భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. సర్వసభ్య సమావేశం సందర్భంగా పలు శాఖలు ప్రవేశపెట్టిన తీర్మానాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఎంపీడీఓ భవనానికి కుర్చీల బహూకరణ

కొత్తూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి సొంత ఖర్చులతో 400ల కుర్చీలను బహూకరించారు. రానున్న రోజుల్లో తనవంతుగా ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, నాయకులు అంబటి ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, దయానంద్‌గుప్తా, లింగంనాయక్, దయానంద్‌రెడ్డి, జంగయ్య, జయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలను అందజేస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

నిరుద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం

బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన



షాద్‌నగర్: చౌరస్తాలో ధర్నా చేస్తున్న నాయకులు



కొత్తూరు: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



చేవెళ్లలో నిరసన తెలుపుతున్న నాయకులు, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ ఆధ్వర్యంలో పట్టణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డిలు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులను ఆదుకుంటామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. గత బీఆర్‌ఎస్ మాదిరిగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపిస్తుందన్నారు. ప్రభుత్వం జాబ్ కేలండర్‌ను ప్రకటించాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్స్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నంబర్ 46ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, సుబ్రహ్మణ్యం, సాయి, వివేక్, మురళీ, వెంకటేశ్, రుషికేశ్, భూషణ్ పటేల్, శ్రీనివాస్‌చారి, సందీప్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ మండల కేంద్రాల్లో బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మంగళవారం నిరసనలు చేపట్టింది. బీజేవైఎం చేవెళ్ల మండల అధ్యక్షుడు పత్తి సత్యనారాయణ, మొయినాబాద్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌ల అధ్యక్షతన నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతిపత్రాలు అందజేశారు. ఈ మండలాల్లో వేరువేరుగా జరిగిన ఈ నిరసన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు ఆయా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో చేవెళ్ల నాయకులు నితీశ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధూకర్, అభిలాశ్, రాజు, కృష్ణమోహన్, గణేశ్, నరేశ్, భాస్కర్, మొయినాబాద్ నాయకులు గణేశ్ సురేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ప్రకాశ్, ప్రభాకర్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, మల్లేశ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ కొత్తూరు పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆయన మంగళవారం పలువురు నాయకులతో కలిసి తహసీల్దార్ రవిందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్, శ్రీశైలం, రణధీర్‌గౌడ్, ప్రశాంత్, శివ, గణేశ్, మల్లేశ్, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు: నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ నాయకులు కొందుర్గు తహసీల్దార్ రమేశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

షాబాద్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్ డిమాండ్‌చేశారు. మంగళవారం మండ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి మాణయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ, వెల్స్‌పన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో భాస్కర్ ఆస్పత్రి, శ్రీ బాలాజీ దంత వైద్యశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 200 వందల మంది ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది డాక్టర్లు సాయికృష్ణ, రమేశ్, గ్రామస్తులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

- టీడీఎఫ్ జైకిసాన్ ఇండియా చైర్మన్ నరేందర్‌రెడ్డి
- మోకిల రైతు వేదికలో అవగాహన సదస్సు

చేవెళ్ల: దేశీ విత్తనాలు, ప్రకృతి వ్యవసాయం, రసాయన రహిత పద్ధతులపై తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జై కిసాన్, బాసట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మోకిల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు, కాలనీ వాసులకు పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ ఇండియా చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదట రసాయనా లు లేకుండా స్వయంగా పండించుకుని కుటుంబ సభ్యులు తమ అనుభూతిని మిగిలిన రైతులతో పంచుకోవాలన్నారు. కుటుంబానికి సరిపడా పండించిన తర్వాత సాగును గుంటల నుంచి ఎకరాలకు పెంచాలని సూచించారు. అనంతరం టీడీఎఫ్ ఇండియా వనిత చేయూత, బాసట ఫౌండేషన్ అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేసి భావితరాలకు ఆరోగ్యవంతమైన నేలను అందిద్దామని పిలుపునిచ్చారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడిన ఆహార పదార్థాలు తీసుకోవడంతో ఆరోగ్యం పాడవుతుందని వివరించారు. జీవామృతంతో నేలను సుసంపన్నం చేయడం, మజ్జిగ, కుంకుడుకాయ నీరు, వేప నూనెలతో చీడపీడల నివారణ పద్ధతులను తెలియజేశారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణారెడ్డి, రమ్య, కాలనీవాసులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న నరేందర్‌రెడ్డి, వాణి తదితరులు